# సీరియల్ కథ

**చం**ద్రమతి మిట్టమధ్యాహ్నం పడక్కుర్చీలో పడుకొని ఓ ఆడాళ్ల పత్రికలో సీరియల్‌గా పడిపోతున్న ఓ నవల తాలూకూ ఓ భాగాన్ని ఆనందంగా చదివేస్తోంది. రాన్రాను అందులో హీరో వట్టి వెధవాయిలా కనబడుతున్నాడామెకి. రంభలాంటి మేనమామ కూతుర్ని పెళ్ళాడి (రంభలాగా ఉంది మేనమామ కాదు – ఆయన కూతురు) తన అదృష్టానికి  సంతోషించక మరో గంగిరెద్దు లాంటి వగలాడితో ప్రణయ కలాపాలు మొదలెట్టాడు. దాంతో ఆ విషయం తెలిసిన అతని భార్యామణి అతగాడి మీద ముందు విరుచుకుపడి, తరువాత తిరగబడి 'నీలాంటి వెధవ దగ్గర పడివుండడం అథవా మరేం చేసినా పర్లేద'ని స్టేట్‌మెంటిచ్చేసి పుట్టింటికెళ్ళి అక్కడ ఆవిడకోసమే ఎదురుచూస్తున్న ఓ మాంచి ఉద్యోగంలో చేరిపోయింది. చేరి 'ఆడదంటే అలుసు కాదోయ్ మీ మగాళ్ళ పప్పులిక  ఉడకవోయ్' అంటూ రేడియోలో, తన భర్త వినేలా  పాటలు పాడింది. ఆ పిల్ల ధైర్యానికీ, తెలివితేటలకీ సంతోషంతో చప్పట్లుకొట్టి విజిల్స్ వేద్దామనిపించింది చంద్రమతికి. కానీ కథలో పడీ మళ్ళీ  ఆ విషయం మర్చిపోయింది. అలా వెళ్ళిపోయిన భార్యమీద బెంగపెట్టుకొన్నాడు. హీరో! గడ్డం కూడా రెండు మూడంగుళాలు పెంచుకొన్నాడు. అక్కడితో సీరియల్ ఆగిపోయింది. మిగతా వచ్చే సంచికలో!

'ఛీ! పాడు' అనుకొంది చంద్రమతి.

ఈ సీరియల్స్‌తో ఇదే చావు! ఝుమ్మని చదివేద్దామనుకొంటే ఠకీమని మాంచి సస్పెన్సులో ఆగిపోతుంది. ఇక మరో సంచిక వచ్చేవరకూ మన మనసు మనసులో ఉండదు. ఆ హీరోయిను పాపం ఒక్కతీ ఏం బాధలు పడుతుందో ఏమో, ఆ హీరోగాడికి బుద్ధి రావడానికి ఇంకెన్ని సంచికలు చదవాలో ఏమో అని ఒకటే ఇది! అయినా ఈ మగవాళ్ళందరికీ ఇదేం బుద్ధో పాడు బుద్ధి! రంభలాంటి పెళ్ళాం ఇంట్లో ఉన్నా మళ్ళీ పరాయి ఆడదానిమీదే కన్ను! అన్ని రోజులూ పెళ్ళాం మీద చూపిన ప్రేమంతా, పెళ్ళాం పోట్లాడి పుట్టింటికెళ్ళిపోయినా,  లేదా ఆ మహాసాధ్వి గగనసీమల కెగసిపోయినా గానీ... చిటుక్కున మాయమయిపోతుంది. వెంటనే మరో ఆడదీ – దానిమీద అంత కంటె బోలెడు  ప్రేమా మొదలు.

ఛీఛీ అసలు మగాళ్ళను నమ్మకూడదు. ఇదిలా ఉండగా పెళ్ళాం ఉండగానే మరో పెళ్ళి చేసుకొనే వాళ్ళు మరికొంత మంది. అలాంటి వాళ్ళను రోట్లోవేసి చట్నీ చేయాలి అనుకొంది చంద్రమతి కసిగా.

ఆ కసిలో హఠాత్తుగా తన భర్త లక్ష్మీపతి గుర్తుకొచ్చాడామెకి. అతను కూడా అందరు మొగాళ్ళలాంటి వాడేనా? అతనికీ మరో ఆడదానిమీద చూపులూ, ఆశలూ ఉంటాయా?

ఆ ఆలోచన కొంచెం చేదుగా అనిపించిందామెకి.

ఊహూఁ ఆయన అలాంటి వారు కాదు. అసలు అందరి లాంటి మనిషే కాదు. ఆయనకి తనంటే తెగ ప్రేమ.

అలా అనుకొంటుండగానే కొద్ది రోజులక్రితం జరిగిన సంఘటన ఠక్కున బయటికొచ్చి ఆమె కళ్ళముందు నిలబడింది. 'ఓసి. నువ్వా! నీ సంగతే మర్చిపోయాను స్మీ!' అనుకొంది ఆ సంఘటనని చూచి. తీరా అదంతా గుర్తుకు తెచ్చుకొనేసరికి వళ్ళంతా కంపరమెత్తినట్లయి పోయింది.

ఆ రోజు తనూ ఆయనా సినీమా కెళ్తున్నారు. బస్ దిగబోతుంటే ఓ అమ్మాయ్ బస్ ఎక్కబోతూ ఆయనను చూసి 'హలో' అంటూ నవ్వింది. ఆయనేమో కొంచెం కంగారుపడి కొంచెం బిగుసుకుపోయారు.

'హలో' అనేశారు గాబరాగా ఆ పిల్లవంక చూసి,

ఈలోగా ఆ పిల్ల బస్సెక్కేయడం, బస్సు స్టార్టయి పోవడం జరిగింది.

'ఆ పిల్లెవరు?' అని తనడక్క ముందే ఆయనే చెప్పేశారు.

'ఆ అమ్మాయెవరో తెలుసా?... వాడే! ఇహి. అంటే నా ఫ్రెండ్ – అహహ– నా ఫ్రెండంటే ఆ అమ్మాయి కాదు – చిరంజీవిగాడనీ మా ఫ్రెండ్‌గారు లేడూ? వాడి... చెల్లెలు – అందుకని – ఇహిహి ... పలుకరించింది.'

'చిరంజీవి అంటే మన పెళ్ళికొచ్చిన ఆ కళ్ళజోడబ్బాయేనా?'

'ఎగ్జాక్టలీ–ఎజ్జాట్‌లీ! వాడే వాడే వాడే వాడే!'

"సరేలెండి 'వాడే' అని ఓసారంటే చాలదా ఏమిటి?" అనేసింది తను. ఎందుకో తనకప్పుడేమీ అనుమానం రాలేదు. బహుశా నరాల బలహీనతవల్ల కాబోలు. అంచేత అక్కడితోనే ఆగి పోయిందా విషయం. ఆ తరువాత ఎప్పుడయినా ఆ సంఘటన

గుర్తుకొచ్చి, కొంచెం అనుమానం కలిగించినా తన అనుమానాలే తప్పేమోనని సరిపెట్టేసుకొంటోంది. అదీగాక ఎప్పటికయినా ఈ చిరంజీవి, అనే ఆయన స్నేహితుడు ఎక్కడయినా ఎదురయితే ఆ విషయం నిర్ధారణ చేసుకోవచ్చని కూడా ఊరుకొంది.

కాని ఇప్పుడు అనిపిస్తోంది.

ఆ విషయం నిర్లక్ష్యం చేయకుండా వుండాల్సిందని.

బయటినుంచీ ఓ పాత ఇంగ్లీష్ ట్యూన్‌ని విజిలేసుకొంటూ వస్తున్న లక్ష్మీపతినిచూసి చటుక్కున ఆలోచనల్లోంచి తేరుకొంది చంద్రమతి.

'హలో హలో – ఏమిటింకా రడీకాలేదా?' అన్నాడు లక్ష్మీపతి చంద్రమతి వంక ఆశ్చర్యంగా చూస్తూ.

ఠక్కున గుర్తుకొచ్చింది చంద్రమతికి.

'మర్చేపోయాను మన ప్రోగ్రామ్ సంగతి. ఎంత– అయిదు నిముషాల్లో రడీ అయిపోతాను. మీరీలోగా ఆ ఫ్లాస్కులో కాఫీ ఉన్నాయ్ – తాగేసేయండి' అనేసి హడావుడిగా అక్కడినుంచి పరుగెత్తింది చంద్రమతి.

ఆవేళ సాయంత్రం ఎగ్జిబిషన్ కెళ్దామని అతగాడు చెప్పిన విషయం ఈ ఆలోచనల్లో పడి పూర్తిగా మర్చేపోయింది తను.

మరి కాసేపట్లో ఇద్దరూ ఆటోలో ఎగ్జిబిషన్‌చేరుకొన్నారు. ప్రతీస్టాల్ దగ్గర అయిదు నిమిషాలు నిలబడి, తనకూ, ఆమెకూ కూడా తెలీని విషయాలెన్నో చెప్పసాగాడతను చంద్రమతికి.

అతనికెంచేతో చాలా హుషారూ ఉందీవేళ.

''నీకేమయినా నచ్చిన వస్తువులు కనబడతే కొనేసుకో చంద్రమతీ! మొఖమాటపడక'' అని కూడా అనేశాడు.

చంద్రమతీ అన్నీ చూశాక తనకి ఎగ్జిబిషన్‌లో పిల్లల నెక్కించుకొని చుట్టూతా తిరిగే మినీ రైలుబండి నచ్చిందంది.

అది ఎంత కమ్ముతారో కనుక్కొస్తానని అతను అటు వైపు వెళ్ళబోయేసరికి ఎదురుగ్గా చిరంజీవి వచ్చేశాడు.

''హలో'' అన్నాడతను లక్ష్మీపతిని సంబరంగా చూస్తూ. లక్ష్మీపతి వణికిపోయాడు. తనారోజు భానుమతి కనిపించి హలో అన్నప్పుడు ఆ పిల్ల చిరంజీవిగాడి చెల్లెలని

చంద్రమతికి బొంకిన మరుక్షణం నుంచీ ఆ వెదవ తామిద్దరూ కలసి వెళ్తున్నప్పుడు ఎదురవకుండా ఉంటే బావుండునని మొక్కుకుంటూనే వచ్చాడు. కానీ ఈ ఎగ్జిబిషన్ రైలుబండి ఎంతకమ్మితారో అన్న ఆలోచనలో పడి రెండు క్షణాలు మాత్రం ఆ సంగతి దేవుడికి మొక్కడం మర్చిపోయాడు. అంతే! వీడు తయారు.

లక్ష్మీపతి ఖంగారుగా చంద్రమతివేపు చూశాడు.

ఈలోగా చిరంజీవిగాడు "హలో హలో" అనేశాడు చంద్రమతిని చూసి. "బాగున్నారా భానుమతిగారూ" అని కూడా అడిగేశాడు.

"రట్! రట్ – మా మిసెస్ చంద్రమతి" అన్నాడు లక్ష్మీపతి ఏడుపు ఆపుకొంటూ. వెంటనే నాలిక్కరుచుకుని జేబులోంచి కళ్ళజోడు తీసి కళ్ళకు తగిలించుకొన్నాడు చిరంజీవి.

"నమస్తే" అంది చంద్రమతి వెదకబోయిన తీగ కాళ్ళకు తగలడమే కాకుండా పూర్తిగా చుట్టేసుకొన్నంత సంతోషంతో.

"నమస్తే నమస్తే నమస్తే నమస్తే..." అనేశాడు చిరంజీవి గాబరాగా.

"మిమ్మల్నిచూసి – అయ్‌మీన్ సరిగ్గా చూడక– భానుమతిగారనీ... హో– సారీ– పొరపాటు పడ్డాను–" మరింత కంగారుగా అన్నాడు ఓ క్షణం ఆగి.

లక్ష్మీపతి జుట్టు పీకేసుకొన్నాడు.

"భానుమతి ఎవరు?" అనుకోకుండా దొంగని పట్టేసుకొన్న పోలీసులా అడిగింది చంద్రమతి.

అదే... మన లక్ష్మీపతి అదివర...." లక్ష్మీపతి ఎంత ఉరిమిచూసినా చిరంజీవి ధోరణి ఆగేట్లు కనిపించక పోయేసరికి గత్యంతరం లేక బూట్ కాలితో చిరంజీవి మోకాలిమీద లాగి తన్నాడు.

'అబ్బా!' అన్నాడు చిరంజీవి కాలు పైకెత్తి చూసుకొంటూ చంద్రమతి ఆశ్చర్యపోయింది.

'ఏమయింది?' అందతని మోకాలివేపు చూస్తూ. వెంటనే లక్ష్మీపతి చిరంజీవి వంక చూసి బోలెడు సైగలు చేసేశాడు. పళ్ళు కొరికాడు. కళ్ళు ఉరిమాడు. పిడికిలి చూపించాడు. అప్పటిగ్గాని చిరంజీవికి సంగతి అర్థంకాలేదు.

'మరేం లేదు. పాపం వీడికి హఠాత్తుగా కీళ్ళనొప్పులొస్తుంటాయ్ అప్పుడప్పుడు' అన్నాడు లక్ష్మీపతి ఠక్కున.

‘అవును పాపం’ అన్నాడు లక్ష్మీపతి ఇంకా బోలెడు జాలిగా.

‘ఎన్నాళ్ళనుంచీ ఇలా పాపం?’ తిరిగి అడిగిందామె.

‘రెండేళ్ళనుంచి పాపం!’ అన్నాడు లక్ష్మీపతి చిరంజీవి వంక మరో కొత్త సైగచేస్తూ.

కానీ ఆ సైగను అర్థం చేసుకోలేని చిరంజీవి ‘రెండునెలల్నుంచీ నండీ’ అనేశాడు ఖంగారుగా.

చంద్రమతి మళ్ళీ అనుమానంగా చూసింది ఇద్దరివేపూ.

‘అహ్హహ్హా’ అంటూ గట్టిగా నవ్వేశాడు లక్ష్మీపతి.

‘ఎందుకలా నవ్వటం?’ కోపంగా అడిగింది చంద్రమతి.

‘అదే! చిరంజీవిగాడు ‘రెండు నెలల్నుంచీ’ అనడం చూస్తే నవ్వొచ్చింది. సంవత్సరాలని నెలలని పిలిచే అలవాటింకా మానలేదు వాడు.’

‘అదేమిటి? సంవత్సరాల్ని నెలలని పిలిచేవాళ్ళని నేనెక్కడా చూడలేదు’ విచిత్రంగా చూస్తూ అంది చంద్రమతి.

‘నేనూ చూళ్ళేదు చంద్రమతీ! కానీ వీడొఖ్ఖడూ ఎందుకో అలా అంటాడు’మళ్ళీ నవ్వడానికి విశ్వప్రయత్నం చేస్తూ అన్నాడతను.

‘అవునవునండీ? ఏమిటో – వెధవది అలా అలవాటయిపోయింది. ఆ మాటకొస్తే మా పూర్వీకుల్లో కూడా ఎవరో ఇలాగే అనేవారుట! ఆయన లేక ఆమె పోలికలే నాకూ వచ్చాయని మా అమ్మమ్మో లేక తాతయ్యో – ఎవరో అంటూండేవారు. మా పూర్వీకులు...”

చంద్రమతి విసుగ్గా చూసింది చిరంజీవి వేపు.

‘మీ పూర్వీకుల గొడవలు మానకెందుగ్గానీ – మీ చెల్లాయిని తీసుకుని మా ఇంటికి రండోసారి....”

“అహ్హహ్హా అంటూ నవ్వేశాడు చిరంజీవి.”

లక్ష్మీపతి కళ్ళు తేలవేసి మళ్ళీ మామూలు చోటకి చేర్చేసుకొన్నాడు. చంద్రమతికి అతని నవ్వు చూసేసరికి వళ్ళు మండిపోయింది.

“బలేవారే అండీ భలేవారే! నాకు చెల్లెలు’ ఎక్కడుందీ? చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ, అక్కలూ, అన్నలూ ఎవ్వరూలేని అనాధ పక్షిని!”

పరిస్థితి పూర్తిగా విషమించేసినట్లు పసిగట్టేశాడు లక్ష్మీపతి.

"ఏమిటి? మీకు చెల్లాయ్‌లేదా?" ఆశ్చర్యంగా అడిగింది చంద్రమతి.

'కొంచెం కూడా లేదు..' నవ్వుతూ అన్నాడు చిరంజీవి.

"మరి.. ఆ రోజు బస్ దగ్గర మిమ్మల్ని పలుకరించని అమ్మాయ్ చిరంజీవి చెల్లెలని చెప్పారు కదా?' కోపంగా లక్ష్మీపతి వంక చూస్తూ అడిగిందామె.

'అవునవును 'వీడి చెల్లెలే – తనకు చెల్లెళ్ళు లేరని తమాషాగా అంటున్నాడు వీడు' తడబడుతూ అన్నాడు లక్ష్మీపతి.

"మా చెల్లెలా?" సంగతి అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తూ అన్నాడు చిరంజీవి.

"అవున్రా! మీ చెల్లెలే కనిపించిందారోజు" చిరంజీవి మోకాలిమీద మళ్ళీ తంతూ అన్నాడు లక్ష్మీపతి.

"అబ్బా" అన్నాడు చిరంజీవి మళ్ళీ మోకాలు పట్టుకొని.

"ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగింది చంద్రమతి.

"కీళ్ళనొప్పి! మళ్ళీ వచ్చింది" అన్నాడు చిరంజీవి ఓవరాక్షన్ చేస్తూ.

"ఇలా ఎన్ని సార్లొస్తుంటుంది రోజుకి?"

"ఇన్నిసార్లని చెప్పటం కష్టమండీ! ఓసారి లెక్కవేద్దామని మొదలెట్టాను గానీ ఆ రోజు ఆఖరిసారి కీళ్ళనొప్పి వచ్చినప్పుడు లెక్క మర్చిపోయాను."

"ఓహో– అలాగా!" అనుమానంగా అంది చంద్రమతి.

"అవును! అలానే! మరి.... నే వెళ్తాను..." అక్కడి నుంచి పరుగెత్తబోతూ అన్నాడు చిరంజీవి.

"అరె! అప్పుడే వెళ్తున్నారేమిటి? కొంచెం ఆగండి! మీకో చెల్లెలుందని మీ స్నేహితుడూ, లేదని మీరూ వాదించుకొంటున్నారుకదా? నే నెవరితో ఏకీభవించాలి?" నవ్వుతూ అడిగింది చంద్రమతి. ఇంక లాభం లేదు పరిస్థితులు విషమించి పోతున్నాయని లక్ష్మీపతి కల్పించేసుకున్నాడు.

"అదికాదు చంద్రమతీ! వీడికో చెల్లాయున్నమాట నిజమేగానీ ఆ అమ్మాయికీ వీడికీ విరోధం వచ్చింది. అందుకని ఆమెమీద కోపంతో తన కసలు చెల్లెలే లేదని అంటూంటాడు వీడు! కదురా?" అడిగాడు లక్ష్మీపతి.

"అవున్రా" అన్నాడు చిరంజీవి ఆశ్చర్యం అణచుకొంటూ.

చంద్రమతికి వాళ్ళిద్దరి ప్రవర్తనా మరింత అనుమానం కలిగించింది.

"బావుంది! కానీ మీ చెల్లాయ్‌కీ మీకూ అంత విరోధం ఎందుకొచ్చిందీ?" అడిగింది తనలో తను అనుకొంటున్నట్లు.

"అదా! అదీ– అసలేమయిందంటే మా చెల్లాయ్ ఓసారి ఏదో నా కిష్టంలేని పని చేసింది. అదేమిటో నాకు గుర్తులేదు. అలా ఆ ఏదో పని ఎందుకు చేశావని నే నడిగితే ఆ ఏదోనే కాదు, ఇంకేదైనా కూడా చేసే హక్కు నాకుంది, అంటూ దబాయించింది. మరి అలా సమాధానాలు చెప్తే కోపం రాదూ?" చంద్రమతినే రిఫరీలా అడిగాడతను.

"వస్తుంది...." నెమ్మదిగా అంది చంద్రమతి.

"నాకూ కోపం వచ్చింది. కోపం వచ్చాకయినా మా చెల్లాయ్ తగ్గాలా? ఊహు ఐ డోంట్ కేర్ అంది. దాంతో విరోధం రాదూ?" మళ్ళీ అడిగాడతను.

"సరే– సరే – వెళ్ళిరండి పాపం! మీరు చాలా కష్టాల్లో ఉన్నారనుకొంటాను–" మూతి బిగించుకొంది చంద్రమతి.

చిరంజీవి అర సెకండులో వాళ్ళ కంటికన్నబడకుండా మాయమయిపోయాడు.

లక్ష్మీపతి గుండెలమీద చేయి వేసుకొని "హమ్మయ్య" అన్నాడు.

"హమ్మయ్య... ఎందుకూ?" పౌరుషంగా అడిగింది చంద్రమతి.

"ఊరికే – అంటే మరీ ఊరికే కాదు– మామూలుగా – అంటే చాలా మామూలుగా– అంటే–"

"చాల్చాల్లే పదండిక–" అందామె విసురుగా.

ఇదే మంచి సమయమనుకుని లక్ష్మీపతి గట్టిగా నవ్వేసి వెంటనే టాపిక్ మార్చేసి ఆమెకు వియత్నాం యుద్ధం గురించి చెప్పసాగాడు. అంతా విని అన్నీ అయిపోయాక,

"వియత్నాం యుద్ధమూ లేదు– వంకాయ కూరా వద్దూ గానీ, మీరు రేపాదివారం చిరంజీవిని అతని చెల్లాయ్‌ని మనింటికి తీసుకొచ్చారా సరేసరి. లేకపోతే ఆ రోజు మీకు కనిపించిన పిల్ల మీ ప్రియురాలిని నమ్మే హక్కు నాకుంది – అంచేత పుట్టింటికి వెళ్ళిపోగల హక్కు కడా నాకే ఉంది."

అనేసి అతనింకేదో చెప్పబోతుంటే "అంతవరకూ నాతో మాట్లాడకండి! ఒకవేళ మీరు మాట్లాడినా గోడతో మాట్లాడినట్లే అవుతుంది" అనేసింది.

లక్ష్మీపతి తెల్లబోయి, తరువాత నల్లబోయాడు. బోరుమన్నాడు– లోలోపల! పైకి మాత్రం "అహహ! అంతా వట్టిదే కదూ" అనేశాడు నవ్వుతూ.

అన్నట్లుగానే ఆదివారం వచ్చేసింది.

"ఇదిగో చంద్రమతీ! మరే రాత్రి చిరంజీవి కనబడ్డాడు. వాళ్ల చెల్లాయిని తీసుకొని మనింటికి రమ్మని చెప్పాను. కానీ రెండు రోజుల క్రితమే వాళ్ళ చెల్లాయ్ అమెరికా వెళ్ళిపోయిందట..." భయం భయంగా అన్నాడు లక్ష్మీపతి.

"అమెరికానా?" ఆశ్చర్యంగా అడిగింది చంద్రమతి.

"అవును"

"ఎందుకు?"

"ఉద్యోగం కోసం – మన్దేశంలో ఉద్యోగాలు దొరకలేదట – అసలింకెప్పుడూ మన దేశానికి రానట్టు కూడా చెప్పేసి వెళ్ళిందట."

'ఓహో' అంది చంద్రమతి "అలాగయితే నేను ఇప్పుడే మా ఊరెళ్ళిపోతున్నాను" అందామె.

"అదేమిటి?" ఏడుపు మొహంతో అన్నాడు లక్ష్మీపతి.

"మీలాంటి అబద్ధాలకోరుతో కాపరం చేయడం కంటే పుట్టింట్లో స్వేచ్ఛగా బ్రతకటం మంచిదట" అనేసి బట్టలు సర్దుకోసాగిందామె.

"అలా అని ఎవరు చెప్పారేమిటి?" అనడిగాడతను.

"ఎవరేమిటి? బుద్ధున్నాళ్ళెవరయినా చెపుతారు! మీకు బుద్ధి రావాలంటే ఈ పత్రికలో "జీవనదిలో జీలకర్ర" సీరియల్ చదవండి! అంటూ ఆ పత్రిక అతని మీదకు విసిరేసి సూట్‌కేస్ తీసుకొని బయటకొచ్చి రిక్షా ఎక్కేసింది.

లక్ష్మీపతి ఆ సీరియల్ చదివి మరింత గాఢంగా ఏడుస్తూ చిరంజీవి గదికి చేరుకొన్నాడు. నిద్రలేచి తలుపు తెరిచాడతను.

"ఏమిట్రా.... పొద్దున్నే వచ్చావ్" అడిగాడు చిరంజీవి మళ్ళీ నిద్రపోవటానికి ఉపక్రమిస్తూ.

"నిన్ను మర్డర్ చేయటానికి" ఉద్రేకంగా అన్నాడు లక్ష్మీపతి.

చిరంజీవి నిద్రమత్తు పూర్తిగా ఎగిరిపోయింది.

జాగ్రత్తగా లక్ష్మీపతి చేతుల వంక చూశేడు. కత్తులూ వగయిరా ఏమయినా ఉన్నాయేమోనని.

"ఛ... ఊరికే అంటున్నావ్ కదూ అలాగని?" నవ్వు నటిస్తూ భయంగా అడిగాడు.

"ఊరికే ఏం కాదు! కానీ ఇప్పుడు కిప్పుడు చంపటం కొంచెం కష్టం. టైం పడుతుంది" అన్నాడు లక్ష్మీపతి.

"కానీ... నాలాంటి మంచివాడిని చంపితే నీకేమిటి లాభం?" దిగులుగా అడిగాడు చిరంజీవి.

'నా పండంటి కాపరాన్ని కూల్చేశావ్ నువ్వు!" ఏడుపు మొఖంతో అన్నాడతను.

"ఆ మాట మాత్రంనేను చస్తే ఒప్పుకోను. కాపరాలు కూలగొట్టడం నాహాబీ కాదు. కేవలం స్టాంపులు సేకరించడం ఒఖటే నా హాబీ!"

"ఏడ్చావ్.. నువ్వలా నీకు చెల్లాయ్ లేదని చెప్పకపోతే ఇంత గొడవొచ్చేదా కాదు..." ఏడుపు ఆపుకొంటూ అన్నాడు లక్ష్మీపతి.

'మరి ఆ భానుమతిని మా చెల్లాయ్ అని మీ ఆవిడకు చెప్పినట్లు నాకేం తెలుసు?"

ఇద్దరూ ఒకరివంక ఒకరు దిగులుగా చూసుకొన్నారు.

'ఇంతకూ మీ ఆవిడకసలు ఆ అనుమానం ఎందుకొచ్చింది?"

'ఇదిగో! ఈ పాడు పత్రికలో సీరియల్ చేసిందా పని' పత్రికను చిరంజీవి మీదకు విసుర్తూ అన్నాడు లక్ష్మీపతి.

చిరంజీవి ఆ సీరియల్ చూశాడు. వెంటనే చదివాడు.

'హ' అన్నాడు చదిది, రెండుక్షణాలాగి ఓహో, అని కూడా అన్నాడు.

"మరోసారి 'ఓహో' అన్నావంటే తంతాను' కోపంగా అరిచాడు లక్ష్మీపతి.

"అబ్బే...ఇంక అనన్లే. ఇంతకూ మీ ఆవిడ తిరిగి నీ దగ్గరకు రావడమే నీక్కావలసింది."

"అవున్రా శుంఠా! అంతకంటె ఇంకేం కావాలి నాకు! కానీ అదంత తేలిగ్గా లొంగే ఘటం కాదురోయ్! జగమొండి! ఆ సీరియల్‌లోని హీరోయిన్‌లాగానే ఓ మంచి ఉద్యోగం చేసుకొని బోలెడు సుఖంగా బ్రతుకుతానని చెప్పేసి వెళ్ళింది."

"ఓహో"

"అదే అనొద్దన్నాను. నాకు వళ్ళుమంట. 'ఓహో' అంటే"

"అవును! ఇంతకుముందోసారి చెప్పినట్లు గుర్తుంది. పద మనం బయల్దేరదాం! నీ కాపరం గట్టున పెట్టే బాధ్యతనాది! సరేనా?"

"అంటే? నాకు ఇంకో పెళ్ళి చేస్తావా?" అనుమానంగా అడిగాడు లక్ష్మీపతి.

"ఛ! ఛ! నీ కెందుకు! నువ్వు పద నాతో! నేను చెప్పినట్లు చేయ్! అంతే. పది రోజుల్లో నీ జీవితం మూడుపూవులూ పాతిక్కాయలుగా ఉంటుంది."

ఇద్దరూ రోడ్డుమీద కొచ్చేరు.

ఏవేవో సందులు తిప్పి ఓ పెద్ద ఇంటి దగ్గరకు తీసుకెళ్ళాడు చిరంజీవి. ఇంటిబయట 'శ్రీమతి నవలాదేవి, ప్రముఖ రచయిత్రి' అన్న బోర్డు ఉంది.

"అరె! ఇందాక నేను చూపించిన పత్రికలోని సీరియల్ రాసింది. ఈవిడే కదూ?" ఆశ్చర్యంగా అడిగాడు లక్ష్మీపతి.

"ఆ సంగతే తెలీదు. వాళ్ళింట్లోని వంటవాడే కథలూ, నవలలూ రాసి ఆవిడ పేరుతో పంపుతాడని కొంతమందీ, కాదు, ఆవిడే ఇంకెంతో మంది కథలూ నవలలూ చదివి చూచి వ్రాత వ్రాస్తుందని మరి కొందరూ వాదించుకొంటున్నారు. ఆఫ్‌కోర్స్ – నేను వీళ్ళిద్దరితోనూ ఏకీభవంచలేదులే – అసలు.." అని ఇంకేదో చెప్పబోతూండగానే 'హలో' అంటూ ఒకామె ఇంట్లో నుంచి బయటికొచ్చేసింది.

"రండి... రండి.. రండి.. రండి..." అంటూ వాళ్ళిద్దరినీ అతి మర్యాదగా లోనికి ఆహ్వానించేసింది.

ఇద్దరూ సోఫాల్లో కూలబడ్డారు.

"కాఫీయా, హార్లిక్సా బీరా, బ్రాందీయా?" అనడిగిందామె వినయంగా.

"హబ్బే... అదేమీ వద్దండీ..." సిగ్గుపడ్డారిద్దరూ.

"మరేం ఫర్వాలేదులెండి! ఇది మీ ఇల్లు అనుకోండి. ఏయ్ రంగీ– హార్లిక్స్ తీసుకురా..." లోపలకు చూసి ఆర్డరు చేసిందామె.

"ఇంతకూ మీరు ఏ నవల కొనడానికొచ్చారు?" అందామె చిరునవ్వుతో. చిరంజీవి బిత్తరపోయి లక్ష్మీపతివేపు చూశాడు.

"కొనడమా?" అన్నాడు ఖంగారుగా.

“ఏమోరా! ఈ రోజుల్లో నవలలకి డిమాండ్ పడిపోయిందని అంటున్నారు. ఒకవేళ ఇంటికొచ్చిన అభిమానులకే కాపీలు అమ్ముకుంటున్నారేమో ఇప్పుడు” అనుమానంగా అన్నాడు లక్ష్మీపతి చిరంజీవి చెవిలో

“అంటే... మీరు ఆకాశం పిక్చర్స్ అధినేతలు కాదా?” అనుమానంగా అడిగిందామె.

“ఆకాశం పిక్చర్సా? అబ్బే... మేము... మీ దురభిమానులము “దేవత” పత్రికలోని మీ సీరియల్ చదివి మిమ్మల్ని అభినందించడానికొచ్చాము.”

“అలాగా...” నిరుత్సాహంగా అందామె. అని “ఒరే రంగీ! హార్లిక్స్ వద్దులే! ‘టీ’ తీసుకురా” లోపలకి చూచి అరిచింది.

“ఆ సీరియల్ మీకు బాగా నచ్చిందా?” అడిగిందామె.

“బాగా ఏమిటండీ– మొహం పగిలిపోయేంత బాగా నచ్చింది. అసలు ఆ తరువాత ఏమవుతుంది? హీరో ఏం చేస్తాడు?” అడిగాడు చిరంజీవి.

“ఏముందీ? హీరో పశ్చాత్తాపపడి హీరోయిను ఇంటికెళ్ళి ఆవిడ కాళ్ళ మీద పడి బ్రతిమాలి తనతో తీసుకొస్తాడు...”

లక్ష్మీపతి ఓసారి జుట్టుపీకేసుకుని మళ్ళీ సర్దేసుకొన్నాడు.

“అయినా– ఆ తరువాతి భాగం ఇంకా రాయలేదు. ఎలా రాయాలో అని ఆలోచిస్తూనే ఉన్నాను. సాధారణంగా ఇలా జరిగితే బావుంటుందని పాఠకులే ఉత్తరాలు రాస్తూంటారు వాళ్ళు కోరినట్లుగానే పొడిగించుకొంటూ వస్తాను” నవ్వుతూ అందామె.

“ఈ పద్ధతి చాలా అద్భుతంగా ఉందండీ! కానీ మీరు ఈసారి కొత్త తరహాగా రాస్తే బావుంటుందని మా ఉద్దేశం!” నవ్వుతూ అన్నాడు చిరంజీవి.

“ఏమిటది?” ఆసక్తిగా అడిగిందామె.

“ఆ హీరోని ఇంకా క్రూరంగా చిత్రించండి. ఆమె వెళ్లిపోయిందే మంచిదనుకొని ఆ వగలాడినే ఇంటికి తీసుకొచ్చి ఆనందంగా కాలం గడుపుతూంటాడు. అప్పుడు హీరోయిన్‌కి వళ్ళు మండుతుంది. సరిగ్గా అదే సమయంలో రేడియో లోనో, లేక వీధిలోనే బిచ్చగాడు పాట పాడుతుంటాడు.

“లేవవే రౌద్రమూర్తీ – చీరబిగింపుము – ఆడదాన్ని అలుసు చేసే మగపురుగుని మట్టుపెట్టుము. ‘లలాలలు లాలాలుల’ ఈ విధంగా ఉంటుంది పాట. ఆ పాటకి ఇన్‌స్పిరేషన్

వచ్చి ఆ హీరోయిను వెంటనే హీరో దగ్గరకొచ్చి ఆ వగలాడిని బయటిగ్గెంటి, హీరోని గట్టిగా చివాట్లేసి తన కాపురం తను నిలబెట్టుకొంటుంది. ఎలా వుంది?" అడిగాడు చిరంజీవి.

"వండర్‌ఫుల్ - ఒరే రంగీ టీ వద్దులే హార్లిక్స్ తీసుకురా" మళ్ళీ లోపలకు చూస్తూ ఆనందంగా అరచింది నవలాదేవి.

ఇద్దరూ వెంటనే లేచి నిలబడి టీ, హార్లిక్సూ రెండూ వద్దని మనవిచేసి బయటికొచ్చేశారు.

అచ్చం నవలలోలా పుట్టింటికి చేరుకున్న చంద్రమతి అచ్చం నవలలోలానే ఉద్యోగం కోసం వెతికింది. కానీ ఉద్యోగం మాత్రం నవలలో దొరికినట్లు దొరకలేదు. ఇదేమిటా అని ఆశ్చర్యపోయేటంతలో తను చదివిన పత్రిక తరువాతి సంచిక వచ్చేసింది. వెంటనే కొని సీరియల్ తరువాయి భాగం వేగంగా చదివేసింది. చదువుకొన్న కొద్దీ ఆమె మొఖం వివర్ణమయి పోసాగింది. ఇదేమిటీ పాడు రచయిత్రి ఇలా రాసింది? అంతకుముందు సంచికలో హీరోకి బుద్ధి వచ్చేట్లు రాసి ఇప్పుడేమో తిరిగి అతగాడి బుద్ధి బూడిదయి పోయినట్లు ఎందుకు రాసింది?

మరోసారి సీరియల్ చదివింది చంద్రమతి.

చదువుతున్నకొద్దీ వళ్ళు మండిపోతుందామెకి.

ఆ హీరోగాడు పశ్చాత్తాప పడినట్లే పడి అంతలోనే మనసు మార్చుకొని పెళ్ళాం పుట్టింటికి పోవడమే మంచిదయిందనుకొని ఆ రెండో వగలాడిని ఇంటికే తీసుకొచ్చేసి హాయిగా సంసారం మొదలెట్టాడు. అసలు తనకో పెళ్ళాముందున్న తాళికట్టిన విషయం కూడా మర్చిపోయాడు. తను అసలు పెళ్ళాం ఆ వగలాడే అని అనుకోసాగాడు.

చంద్రమతి కేం చేయాలో పాలుపోలేదు. అర్ధరాత్రి వరకూ ఆ హీరోని ,ఆ రచయిత్రిని తిట్టుకొంటూ కూర్చుంది. ఆ తరువాత మీ సీరియల్ 'జీవనదిలో జీలకర్ర' సింగినాదం లాగుంది, ఇంతటితో ఆ చెత్తరాయడం ఆపమని రచయిత్రి పేర ఓ ఉత్తరం రాసి అప్పుడు ప్రశాంతంగా మంచంమీద పడుకుంది. అయితే పడుకొని రెండు నిమిషాలన్నా గడవక ముందే ఓ పాడు ఆలోచన మనసులో జొరబడిపోయింది. దాంతో వళ్ళంతా కంపరమెత్తినట్లయి ఠక్కున మంచంమీద నుంచి లేచి కూర్చుంది. క్షణంలో వళ్ళంతా చెమటలు పట్టేసినాయ్.

"అవును! ఒకవేళ తన భర్త కూడా ఆ సీరియల్‌లో హీరోలాగా ఆ భానుమతిని ఇంటికి తెచ్చుకొని సంసారం మొదలెడితే?"

'మొదలెడితే?" ఏమిటింకా? తప్పకుండా మొదలెడతాడు. ఈ మగాళ్ళ సంగతి తనకు తెలియందేముందీ? అసలీ పాటికి ప్రారంభించాడేమో? మరిప్పుడేమిటి చేయడం? తన కాపరానికి చూస్తూ చూస్తూ నీళ్ళు వదులుకోవలసిందేనా!

"ఉహు! అది జరక్కూడదు. తనేం చేతకాని వాజమ్మ కాదు ఆ సీరియల్‌లోని హీరోయిన్‌లా. వెంటనే వెళ్ళి ఆ రక్కులాడిని తన యింట్లోంచి బయటగ్గెంటి తన భర్తను చెవి నులిమి తన గుప్పిట్లో పెట్టుకొంటుంది."

అప్పటికప్పుడే తన బట్టలన్నీ సర్దుకొని ఎప్పుడు తెల్లారుతుందా అని మేలుక్కూర్చుందామె.

ఉదయం ఫస్ట్‌బస్‌కి బయలుదేరి తనింటికి చేరుకొంది. అప్పుడే ఇంట్లోంచి బయటకు వెళ్ళబోతున్నాడు లక్ష్మీపతి.

ఆమెను చూచి ఆశ్చర్యపోయాడతను.

"ఇది కలే కదూ?" అన్నాడు ఆమె వెనుకే ఇంట్లోకి నడుస్తూ.

"అదేది?" అంది చంద్రమతి ఇల్లంతా వెతుకుతూ.

"ఏదేది?" హోరున ఆశ్చర్యపోతూ అడిగాడు లక్ష్మీపతి.

"అదే – ఆ వగలాడి – హలో భానుమతి"

"నువ్వూరికే అపార్థం చేసుకుంటున్నావ్ చంద్రమతీ!" బాధనటిస్తూ అన్నాడు లక్ష్మీపతి

"అంటే.. అదీ ఇంటికి రాలేదంటారు..." ఇంకా అనుమానంగానే అడిగిందామె.

'నీ మీద ఒట్టు చంద్రమతీ! ఆ అమ్మాయికీ నాకూ ఎలాంటి సంబంధమూ లేదు. కేవలం 'హలో హలో' అంతే!

"హలో హలో అంటే?"

"అంటే – అదే హలో హలో అన్నమాట"

"అంతకంటే ఇంకేం లేదు"

"ఒక్క అంగుళం కూడా లేదు"

"మీరు నిజం మాట్లాడుతున్నారా?"

"నిజమా? కాచివడబోసిన నిజం! అసలు నువ్వో విషయం ఆలోచించలేదు చంద్రమతీ! నేను నిన్ను కట్నం తీసుకోకుండా ఎందుకు పెళ్ళి చేసుకున్నాననుకున్నావ్?"

"మా నాన్న ఆస్తి చూసి.."

"ఠఠ్! ఠఠ్! అదికాదు. కేవలం నీ అందం, నీ కళ్ళల్లోని ఆకర్షణ. మనిద్దరం మీ పిన్ని కూతురు పెళ్ళిలో చూసుకున్న మొదటి చూపులోనే నిన్ను గాఢంగా ప్రేమించాను. ఈ విషయం నీకు అనేకసార్లు లిఖితపూర్వకంగా తెలియజేశాను కూడా అవునా! అలాంటప్పుడు – నీ ముందు నిలబెడితే దిష్టిబొమ్మ లాగుండే ఆ భానుమతి వంక నేను చూస్తానా? ఛఛ ఎంత అన్యాయంగా మాట్లాడుతున్నావ్ చంద్రమతీ!..."

ఆ మాటలతో చంద్రమతి పూర్తిగా కరిగిపోయింది.

తన ఎదురుగ్గా దీనంగా నిలబడ్డ లక్ష్మీపతిని చూస్తే జాలి కూడా వేసింది. ఛీపాడు – ఆ పాడు రచయిత్రి సీరియల్ చదివి తను నిక్షేపం లాంటి తన సంసారంలో నిప్పులు పోసుకోబోయింది.

పశ్చాత్తాపంతో అతనివేపు చూసింది చంద్రమతి. ఇదే అదనని లక్ష్మీపతి ఆమెను సినిమాల్లోలా తన గుండెలకు గాఠిగా హత్తుకున్నాడు.

"నన్నింకెప్పుడూ వదిలి వెళ్ళిపోకు చంద్రమతీ! నువ్వివాళ తిరిగి రాకపోయినట్లయితే నేను ఆత్మహత్య చేసుకుని ఉండేవాడినే" అన్నాడు దిగులుగా.

వెళ్ళనని వట్టేసింది చంద్రమతి.

ఆ తరువాత ఆమెకు చిరంజీవి ఎప్పుడూ, ఎక్కడా ఎదురవ్వలేదు. ఎదురయితే అతని చెల్లెలు నిజంగా అమెరికా వెళ్ళిందా లేదా అన్న విషయం కనుక్కోవాలనే ఉందామెకి.